# అందరి సహకారంతోనే పరిసరాల పరిశుభ్రత

**నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే:** ప్రజా శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం కూడాతోడైతే తప్పక కుండా విజయవంతం అవుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. దోమలపై దండయాత్ర.. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం విజయవంతానికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం 'దోమలపై దండయాత్ర.. పరిసరాల పరిశుభ్రత' కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పల్నాడు బస్టాండ్ వద్ద భారీ బహిరంగ సభ, ప్రదర్శన నిర్వహించారు. సభకు ముందుగా ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి, కలెక్టర్ కాంతిలాల్ దండేలతో కలిసి ఈ- మరుగుదొడ్లు ప్రారంభించి మొక్కలు నాటారు. ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఒకేసారి దోమలపై దండయాత్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అక్టోబరు 2 నాటికి అన్ని మున్సిపల్ ప్రాంతాలు ఓడీఎఫ్‌గా ప్రకటించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పుట్టిన రోజు ఇతర వేడుకల సందర్భల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకుని వాటిని సంరక్షించుకోవాలని చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ అనేక రకాల వ్యాధులకు దోమలే కారమణన్నారు. కలెక్టర్ కాంతిలాల్ దండే, ఎమ్మెల్సీ ఎ.ఎస్. రామకృష్ణ, 20 సూత్రాల పథకం అమలు కమిటీ ఛైర్మన్ శ్రీనివాస సాయిబాబు, కాపు సంక్షేమ సంఘం ఛైర్మన్ రామానుజం, అర్బన్ ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జేసీ ఎం. వెంటేశ్వరరావు, జీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ కృష్ణకపర్థి, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ పద్మజారాణి పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శనను పల్నాడు బస్టాండ్ వద్ద ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మకాయల చినరాజప్ప జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి ప్రతిపాటి పుల్లారావు, కలెక్టర్ కాంతిలాల్‌దండే, జేసీ వెంకటేశ్వరరావు, జీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ కృష్ణకపర్థి తదితరులు ఉన్నారు. ర్యాలీ జిన్నాటవర్, పాత బస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగింది. వివిధ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అధ్యాపకులతోపాటు మెడికల్, నర్సింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు సిబ్బంది కూడా పాల్గొన్నారు.



గుంటూరు నగరంలో ఈ-మరుగుదొడ్లు ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రి ప్రత్తిపాటి తదితరులు



విద్యార్థుల ర్యాలీ

## పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ

**జిల్లాపరిషత్తు (గుంటూరు):** వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలతో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువల నుంచి బయటకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ షేక్ జానీమూన్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం జిల్లాపరిషత్తు కార్యాలయంలో "దోమలపై దండయాత్ర- పరిసరాల పరిశుభ్రత" కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జానీమూన్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. అనంతరం మొక్కలు నాటి పిచ్చి చెట్లను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. జడ్పీ ఉపాధ్యక్షుడు వడ్లమూడి పూర్ణచంద్రరావు, సీఈవో వెంకటసుబ్బయ్య, విభాగాల పర్యవేక్షకులు శ్రీనివాస్, రామచంద్రరావు, కిషోర్, ఉద్యోగులు పాల్గొన్నారు.